మా'నీరు' వృథా..

సిరిసిల్లటౌన్: ఎగువభాగం నుంచి వరదలా పొంగుకొస్తున్న మానేరు నీరు వృథాపోతోంది. కరువు క్షేత్రం సిరిసిల్లకు భూగర్భ జలాలు పెంచేలా చేపట్టిన చెక్‌డ్యాం పూర్తికావడం లేదు. ఫలితంగా భూగర్భ జలాలను పెంచుకునే అవకాశం లేకుండా పోతుంది. సిరిసిల్ల చెక్‌డ్యాం తెగిపోయి మూడేళ్లు గడిచినా, అధికారుల పట్టింపులేమితో ప్రస్తుతం మానేరులో వస్తున్న వరద నీరు నిలువకుండా దిగువకు పారుతోంది. వర్షాకాలంలో జలకళతో కళకళలాడాల్సిన మానేరు చెక్‌డ్యాంపై కొనసాగుతున్న నిర్లక్ష్యంపై కథనం..

- నిలిచిన చెక్‌డ్యాం నిర్మాణం
- ఒక్క వరదకే ధ్వంసమైన వైనం
- తెగిన కట్టలో ప్రాణాలు బలి
- ఎవరి లోపం.. ఎవరికి లాభం..
- రూ.కోట్లు.. నాణ్యతకు తూట్లు..



నిర్జీవంగా మారిన చెక్ డ్యాం



చెక్‌డ్యాం కట్ట తెగడంతో పక్కనుంచి వృథాగా పోతున్న నీరు

జిల్లాకు నీటి కరువును తీర్చే వరప్రదాయని మానేరు నదిలో సిరిసిల్ల ప్రాంతంలో నీటికి భవిష్యత్‌లో కరువు లేకుండా చేసేందుకు ఎగువ మానేరు నుంచి మధ్యమానేరు వరకు నదిపై చెక్ డ్యామ్‌లు నిర్మించారు. 2021లోనే పనులు పూర్తవగా అప్పటి వర్షాకాలంలో వచ్చిన వరదకు చెక్‌డ్యాం కట్ట కొట్టుకుపోయింది. ఫలితంగా వర్షాకాలంలో వచ్చే నీటిని రిజర్వ్ చేసి తద్వారా ఏడాది పొడవునా మానేరులో జలకళ ఉండేలా చేపట్టిన మహత్తర కార్యక్రమం కార్యరూపం దాల్చలేదు.

అప్పట్లో మంత్రి కేటీఆర్ చొరవతో రూ.121 కోట్ల అంచనా వ్యయంతో జిల్లాలో 24 చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకోగా పలుచోట్లలో నాసిరకంగా చెక్‌డ్యామ్‌ల నిర్మాణం చేపట్టగా అందులో సిరిసిల్ల నెహ్రూనగర్ ప్రాంతంలోని చెక్‌డ్యాం ఒకటి. ఈ చెక్‌డ్యాంపై నిర్మించిన కస్బేకట్కూర్ చెక్‌డ్యామ్ కూడా రెండుగా విరిగిపోయింది. ఈక్రమంలో సిరిసిల్ల మినహా మిగతా చోట్లలో చెక్‌డ్యాంలు కొన్ని పూర్తి చేసుకోగా అవి జలకళను సంతరించుకున్నాయి.

వారి తప్పు.. ప్రజలకు ముప్పు

సిరిసిల్లలో సుమారు రూ.4 కోట్లతో నిర్మించిన చెక్‌డ్యామ్ నాణ్యత లేమితో వరదకు కొట్టుకుపోయింది. నదిలో వచ్చే వరదలను తట్టుకునేలా కట్టను నిర్మించాల్సి ఉండగా, అధికారులు మామూళ్లగా తీసుకున్నారన్న ఆరోపణలున్నాయి. అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో సిరిసిల్ల చెక్‌డ్యాం తెగిపోయింది. మూడేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ పనులు పూర్తి చేయడం లేదు. క్వాలిటీకంట్రోల్ నిబంధనలు ప్రకారం కాంట్రాక్టర్ పనులు చేపట్టక పోవడంతోనే, చెక్‌డ్యాం కూలిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇది నది పరివాహకం సమీప రైతులకు శాపంగా మారింది. ప్రస్తుత వర్షాలకు ఎగువమానేరు పొంగడంతో వరద నీరు వాగులో పొంగిపొర్లుతుంది. సిరిసిల్ల ఎగువన ఉన్న పలు చెక్‌డ్యాంలు నిండుకుండలను తలపిస్తున్నాయి. కాంట్రాక్టర్, అధికారుల తప్పిదం ప్రజలకు ముప్పుగా పరిణమించడంతో సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.

ఆరుగురిని మింగిన తెగిన కట్ట

నెహ్రూనగర్–సాయినగర్ ప్రాంతంలో కట్టిన చెక్‌డ్యాం కట్ట తెగిపోవడంతో అక్కడ లోతుగా గుంతలు ఏర్పడ్డాయి. నీరు నిలిచి ఉండటంతో లోతు తెలువక 14 నవంబర్ 2021లో రాజీవ్‌నగర్‌కు చెందిన తొమ్మిది మంది పిల్లలు సరదాగా ఈతకు వెళ్లి అందులో చిక్కుకున్నారు. వీరిలో ఆరుగురు పిల్లలు బలయ్యారు. ఈక్రమంలో కట్ట నిర్మాణంలో జరిగిన లోపాలపై పెద్ద ఎత్తున ఆందోళనలు జరిగాయి. రూ.కోట్లు వెచ్చించి కట్ట నిర్మాణం పూర్తి చేసుకున్న తరుణంలోనే కొట్టుకుపోవడం, తర్వాత దానిని పునరుద్ధరణ చేపట్టక వదిలేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికీ కట్ట తెగిపోయిన ప్రాంతంలో పెద్దకయ్యలతో ప్రాణాప్రాయంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. అసంపూర్తి కట్టతో అటు భూగర్భ జలాలు ఇటు ప్రజల ప్రాణాలకు హాని ఉందన్న అంశాన్ని పాలకులు, అధికారులు గ్రహించి సత్వరమే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఇసుక స్మగ్లర్లకు అనుకూలం



తెగిన కట్టను నిర్మించకుండా ఉండటం ఇసుక స్మగ్లర్లకు కలిసి వస్తుంది. చెక్‌డ్యాంలో నీరు నిలిస్తే, భూగర్భ జలాలు పెరుగుతాయి. వాగులో ఉన్న ఇసుకకు కూడా రక్షణగా ఉంటోంది. వర్షాకాలంలో ప్రకృతిపరంగా లభించే నీటిని సద్వినియోగం చేసుకునేందుకు నిర్మించిన చెక్‌డ్యాం లక్ష్యం పూర్తిచేయాలి.

– బియ్యంకార్ శ్రీనివాస్, పౌర సంక్షేమ సమితి అధ్యక్షుడు

చెక్‌డ్యాం పూర్తి చేయాలి



మానేరు నదిని ఆనుకుని రింగురోడ్డు నిర్మిస్తున్నారు. వాగులో నీరు నిలిచి ఉంటే పట్టణానికి పర్యాటక అందాలు పెరుగుతాయి. తెగిపోయిన కట్ట వద్ద ప్రమాదకర కయ్యల్లో ఇదివరకు పలువురు ప్రాణాలు వదిలారు. మళ్లీ అటువంటి సంఘటనలు పునరావృతం కావొద్దంటే చెక్ డ్యాం పూర్తవ్వాలి.

– ఇల్లందుల ప్రకాశ్, సిరిసిల్ల

క్లుప్తంగా

రోడ్డు మరమ్మతు చేయాలంటూ ధర్నా



ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఇల్లంతకుంట: మండల కేంద్రంలోని రోడ్డుపై ఏర్పడిన గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్న కూడా ఎవరూ పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ నాయకులు బుధవారం రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ మానకొండూర్ నియోజకవర్గ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్ మాట్లాడుతూ మండల కేంద్రానికి నిత్యం వందల మంది వివిధ అవసరాల కోసం వస్తుంటారని, కనీసం రోడ్డు బాగు చేయడం లేదన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు సమస్య విన్నవించినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. మండల కేంద్రంలో వారం రోజుల్లోగా రోడ్డు మరమ్మతులు పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్యదర్శి వరుణ్ కాంగ్రెస్ నాయకుల వద్దకు చేరుకుని రోడ్డు మరమ్మతు పనులు చేయిస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు. ఈ కార్యక్రమంలో పసుల వెంకటి, బాలపోచయ్య, జమాల్, సంతోష్, నరేశ్, రజినికాంత్, రాజేశం, ఎల్లారెడ్డి, సంపత్‌రెడ్డి, లింగం, సురేందర్ పాల్గొన్నారు.

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి



మూలవాగు ప్రాజెక్ట్ వద్ద తహసీల్దార్, అధికారులు

కోనరావుపేట: మండలంలో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రవికాంత్ కోరారు. వర్షాలకు నిండిన నిమ్మపల్లిలోని మూలవాగు ప్రాజెక్టును బుధవారం సందర్శించారు. ప్రాజెక్ట్‌లో పూర్తిస్థాయికి చేరిన (19 అడుగులు) నీటి మట్టాన్ని పరిశీలించిన అనంతరం మాట్లాడారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లను వదిలిపెట్టి సురక్షిత ప్రాంతాల్లో ఉండాలన్నారు. వర్షాల వల్ల ఎలాంటి సంఘటనలు జరిగినా తమకు వెంటనే సమాచారం అందించాలన్నారు. ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్య, ఎంపీడీవో రామకృష్ణ, రైతుసమన్వయ సమితి మండలాధ్యక్షుడు గోగు ప్రతాపరెడ్డి, అనుముల బాల్‌రెడ్డి ఉన్నారు.

ఘనంగా మొహర్రం



వేషధారణలతో డ్యాన్స్ చేస్తున్న యువకులు

బోయినపల్లి/చందుర్తి: పల్లెల్లో పీర్ల పండుగ సందడి నెలకొంది. కులమతాలకు అతీతంగా బుధవారం మొహర్రం వేడుకలు జరుపుకున్నారు. బోయినపల్లి మండలం మల్కాపూర్, చందుర్తి మండల కేంద్రంలో పులి వేషధారణతో యువకులు డప్పు దరువుకు తగినట్లుగా నృత్యం చేస్తూ అలరించారు. సర్పంచ్ కోరెపు నరేశ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ముస్లింలతో పాటు హిందువులు పాల్గొన్నారు.

పవర్‌కట్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వేములవాడఅర్బన్: వేములవాడ మండలంలోని మల్లారం సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్నందున గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని సెస్ అధికారులు తెలిపారు. నాంపల్లి, మారుపాక, చంద్రగిరి, అగ్రహారం, తెట్టకుంట, గుర్రవాణిపల్లి, చీర్లవంచ, చింతాల్‌ఠాణా, శాభాష్‌పల్లి, కొడుముంజ, అనుపురం, రుద్రవరం, సంకెపల్లి, ఆరెపల్లి గ్రామంలో విద్యుత్ అంతరాయం కలుగుతుందని తెలిపారు.

సమాచారం

నేడు కు.ని.శిబిరం

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వెసెక్టమీ కుటుంబ నియంత్రణ ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి గీతాంజలి తెలిపారు. మగవారికి కోత, కుట్టు లేకుండా శస్త్ర చికిత్స చేస్తారని తెలిపారు. ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతా జిరాక్స్ కాపీలతో శిబిరానికి రావాలన్నారు.

గెస్ట్ లెక్చరర్లు కావలెను

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలోని శాత్రాజ్‌పల్లి రోడ్డులో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కాలేజీలో గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పద్మజ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్, పీడీ పోస్టులకు అర్హులైన మహిళా అభ్యర్థులు ఈనెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నియామకం

నూతన పాలకవర్గం

ఇల్లంతకుంట: మండలంలోని వల్లంపట్ల రజక సంఘం నూతన పాలకవర్గం బుధవారం ఎన్నికైంది. అధ్యక్షుడిగా మొగిలి చంద్రయ్య, ఉపాధ్యక్షుడు వెంకటేశ్, ప్రధానకార్యదర్శి రామస్వామి, కార్యదర్శి బాలయ్య, కోశాధికారి ముత్తయ్య ఎన్నికయ్యారు.

వినూత్న నిరసనలు



ఎల్లారెడ్డిపేటలో ఒంటికాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

ఎల్లారెడ్డిపేట/కోనరావుపేట/ముస్తాబాద్/వీర్నపల్లి/బోయినపల్లి: పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం 21వ రోజుకు చేరింది. ఎల్లారెడ్డిపేటలో కార్మికులు ఒంటికాలు మీద నిలబడి నిరసన తెలపగా, కోనరావుపేటలో తాళ్లతో ఉరిపెట్టుకుని, వీర్నపల్లిలో కళ్లు, చెవులు మూసుకొని నిరసన తెలిపారు. సమ్మెకు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, బీజేపీ జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్‌రావు మద్దతు పలికారు. ముస్తాబాద్‌లో పంచాయతీ కార్మికులు తలపెట్టిన బంద్ విజయవంతమైంది.

భర్తపై భార్య బంధువుల దాడి

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలోని బాలనగర్‌కు చెందిన సయ్యద్ హైదర్ భార్య బంధువులు సుమారుగా 10 మందిపైగా వచ్చి దాడి చేశారని ఆయన తల్లిదండ్రులు వేములవాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ దాడితో ఐదుగురికి గాయలయ్యాయి. వీరిలో తీవ్రగాయాలైన సయ్యద్ హైదర్‌ను చికిత్స నిమిత్తం వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. తమకు వారి నుంచి ప్రాణభయం ఉందని వారిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ఇల్లంతకుంట: వీఆర్ఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వివిధ శాఖల్లో కేటాయించడాన్ని హర్షిస్తూ మండల కేంద్రంలో వీఆర్ఏలు బుధవారం సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ చిత్రపటాలకు వీఆర్ఏలు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్నామని, సీఎం కేసీఆర్ పెద్ద మనసు చేసుకుని తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గురించారన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల వీఆర్ఏలు పాల్గొన్నారు.



క్షీరాభిషేకం చేస్తున్న వీఆర్ఏలు

ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం

ఎల్లారెడ్డిపేట: మణిపూర్ బాధితులకు కేంద్ర ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఎల్లారెడ్డిపేటలో మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను బుధవారం దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే గౌస్, మండల అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో మూడు నెలల నుంచి రావణకాష్టం జరుగుతున్న రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. విఫలమైన అక్కడి ప్రభుత్వాన్ని వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పందిర్ల లింగం, నాయకులు పాల్గొన్నారు.



ప్రధాని దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

వర్ష బీభత్సం



మామిడిపల్లిలో కొట్టుకుపోయిన కాజ్‌వే

కోనరావుపేట: అల్పపీడనంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు పలు చోట్ల కాజ్‌వేలు, కొట్టుకుపోయాయి. పాత ఇళ్లు కూలిపోయాయి. కోనరావుపేట మండలంలోని మామిడిపల్లి మూలవాగుపై ఉన్న కాజ్‌వే కొట్టుకుపోయింది. మామిడిపల్లి–నిజామాబాద్ గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించిపోయాయి. వట్టిమల్ల మూలవాగులో నిమ్మపెల్లి దారిలో ఉన్న వంతెన కొట్టుకుపోయింది.

కూలిన ఇల్లు

ముస్తాబాద్: మండలంలో కొద్దిరోజులుగా కురుస్తున్న వానలకు ఇప్పటి వరకు ఎనిమిది ఇళ్లు కూలిపోయాయని తహసీల్దార్ మునీందర్ తెలిపారు. పోత్గల్‌లో బుధవారం మేకల దేవయ్యకు చెందిన ఇల్లు ఒకవైపు పడిపోయిందన్నారు. ఆ సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పిందన్నారు. రామలక్ష్మణపల్లెలో ఉధృతంగా ప్రవహిస్తున్న మానేరు వాగుపై వంతెనను మూసివేశామన్నారు. కొండాపూర్, ఆవునూర్, తుర్కపల్లి గ్రామ ప్రజలు మానేరు వాగులోకి దిగరాదన్నారు.



వట్టిమల్ల మూలవాగులో తెగిన వంతెన

పీహెచ్‌సీ పరిసరాల్లో వరద నీరు

బోయినపల్లి: స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో వరద నీరు నిలిచింది. పీహెచ్‌సీ ప్రధాన ద్వారంలో అలాగే భవనం పరిసరాల్లో పెద్ద మొత్తంలో వరద నీరు నిలిచి చెరువును తలపిస్తోంది. వరద నీరు వెళ్లే వీలులేక ఆసుపత్రి పరిసరాలు నీటితో నిండిపోవడంతో ఆసుపత్రికి వచ్చే వారు ఇబ్బంది పడుతున్నారు.

స్వచ్ఛ సర్వేక్షన్‌పై దృష్టి సారించాలి

ఎల్లారెడ్డిపేట: గ్రామాల్లో స్వచ్ఛ సర్వేక్షన్‌పై మహిళ సంఘాల సభ్యులు దృష్టి సారించాలని ఎంపీడీవో చిరంజీవి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల సమాఖ్య కార్యాలయంలో బుధవారం మండలంలోని అన్ని గ్రామాల సమాఖ్య అధ్యక్షులతో స్వచ్ఛ సర్వేక్షన్, హరితహారంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మొక్కల పెంపకం, పరిసరాల పరిశుభ్రతపై దృష్టి పెట్టాలన్నారు. ప్రధానమంత్రి జీవనజ్యోతి, సురక్ష బీమా యోజన పథకాల అమలుకు మహిళ గ్రూపు సభ్యులు శ్రద్ధ చూపాలన్నారు. అలాగే పండ్ల తోటల పెంపకంపై ప్రతి సభ్యురాలికి అవగాహన కల్పించాలన్నారు.ఈ సమావేశంలో ఏపీఎం మల్లేశం,సీసీలు,మండల సమాఖ్య అధ్యక్షురాలు జ్యోతి,అన్ని గ్రామాల అధ్యక్షులు పాల్గొన్నారు.

బీసీలందరూ ఏకం కావాలి

తంగళ్లపల్లి: బీసీలందరూ ఏకమై అధికార పార్టీ మెడలు వంచాలని కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు కూస రవీందర్ అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడిగా కావలి మల్లేశ్ యాదవ్‌కు గురువారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీబంధు పేరుతో బీసీలను మరోసారి మోసం చేసేందుకు సీఎం కేసీఆర్ కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ద్వారానే బీసీల అభివృద్ధి సాధ్యమన్నారు.

మహిళకు రక్తదానం

ఎల్లారెడ్డిపేట: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఓ మహిళకు రక్తదానం చేసి ప్రాణాలు కాపాడారు. మండలంలోని రాచర్లగొల్లపల్లికి చెందిన బైరి లావణ్య కామారెడ్డి జిల్లా ఉగ్రవాయి దగ్గర ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చారు. ఆమెకు అత్యవసర శస్త్రచికిత్సకు 'ఓ' పాజిటివ్ రక్తం అవసరం కాగా, నారాయణపూర్‌కు చెందిన సెర్ప్ సీసీ లద్దునూరి రమణ, గొల్లపల్లికి చెందిన బైరి తిరుపతిరెడ్డి సకాలంలో రక్తదానం చేయడంతో శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తి చేశారు. అత్యవసర సమయంలో రక్తదానం చేసి ఆదుకున్న వారిని పలువురు అభినందించారు.

పరామర్శ

ముస్తాబాద్: వీర్నపల్లి రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు ఎడ్ల సాగర్ స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పరామర్శించారు. ముస్తాబాద్ మండల రైతుబంధు సమితి అధ్యక్షుడు గోపాల్‌రావు, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, సర్వర్ పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం రుద్రవరం గ్రామంలో ఇటీవల మృతి చెందిన ప్రశాంత్, లక్ష్మి కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి బుధవారం పరామర్శించి, ఆర్థికసాయం అందించారు. సర్పంచ్ ఉరడి రాంరెడ్డి, ప్రవీణ్, రాజిరెడ్డి, మహేశ్, శ్రీనివాస్, రాము, రవి, శ్రీధర్ పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి నిధులివ్వండి

వేములవాడ: వేములవాడ మండల అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఎంపీపీ బండ మల్లేశం యాదవ్ ఎమ్మెల్యే రమేశ్‌బాబును కోరారు. బుధవారం ఎమ్మెల్యే నివాస గృహంలో కలిశారు. అభివృద్ధి పనుల్లో తప్పకుండా తన భాగస్వామ్యం ఉంటుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆయన వెంట సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఏశ తిరుపతి, ఏఎంసీ వైస్‌చైర్మన్ వెల్మ బాల్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ గడ్డం హన్మండ్లు, మండల పార్టీ అధ్యక్షుడు గోసుకుల రవి, కౌన్సిలర్ మారం కుమార్ ఉన్నారు.

బీరప్ప దేవాలయ నిర్మాణానికి నిధులివ్వండి

కురుమ సంఘం ఆధ్వర్యంలో నిర్మించే బీరప్ప దేవాలయ నిర్మాణానికి నిధులివ్వాలని కోరుతూ కొడుముంజ కురుమ సంఘం నాయకులు భూమల లక్ష్మణ్, నాగరాజు, ఎల్లయ్య, పర్శరాములు, రాజు, లక్ష్మణ్, నర్సయ్య, అజయ్, వినయ్ కోరారు. రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో చర్చించి ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.



ఎమ్మెల్యే రమేశ్‌బాబును సన్మానిస్తున్న ఎంపీపీ

సీఎంకు కృతజ్ఞతలు

నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.3 కోట్ల నిధులు మంజూరు చేసిన సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలియజేశారు.

గోరింటా.. పూసింది



సిరిసిల్లటౌన్: ఆషాడం, అధిక శ్రావణ మాసాలు పురస్కరించుకుని జిల్లా పద్మశాలి మహిళా సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సామల పావని, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గుజ్జె తార నేతృత్వంలో బుధవారం మెహెందీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కౌన్సిలర్లు అరుణ, పత్తిపాక పద్మ, మాజీ కౌన్సిలర్ ఆడెపు చంద్రకళ పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును మార్చాలని ఆందోళన

కోనరావుపేట: మండలం నిజామాబాద్ శివారులోని చాంద్‌నగర్ వద్ద ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డును మార్చాలని చాంద్‌నగర్ వాసులు డిమాండ్ చేశారు. బుధవారం డంపింగ్‌యార్డు వద్ద చెత్తను తరలిస్తున్న ట్రాక్టర్‌ను అడ్డుకుని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చాంద్‌నగర్‌లో సుమారు 150 కుటుంబాలు నివాసముంటున్నాయని, ఈ గ్రామానికి 150 గజాల దూరంలోనే డంపింగ్ యార్డు ఏర్పాటు చేశారని అన్నారు. డంపింగ్ యార్డులో చనిపోయిన కుక్కలు, కోళ్లు, ఇతర వస్తువులు పడేయడంతో కుక్కలు బాగా వస్తున్నాయన్నారు. గ్రామంలోకి వచ్చి చిన్నారులపై దాడులు చేస్తున్నాయని, డంపింగ్‌యార్డు నుంచి వచ్చే దుర్గంధంతో రోగాల బారిన పడుతున్నామన్నారు. ఈ డంపింగ్‌యార్డును వేరే చోటుకు మార్చాలని డిమాండ్ చేశారు. కాగా ప్రభుత్వం కేటాయించిన స్థలంలోనే డంపింగ్‌యార్డును నిర్మించడం జరిగిందని సర్పంచ్ కేతిరెడ్డి అరుణ పేర్కొన్నారు.



ఆందోళన చేస్తున్న కాలనీవాసులు

ప్రజల భాగస్వామ్యంతో నేరాల నియంత్రణ

ఎల్లారెడ్డిపేట: ప్రజల సహకారం, భాగస్వామ్యంతో శాంతి భద్రతల నియంత్రణకు కృషి చేస్తానని ఎస్సై నేరెళ్ల రమాకాంత్ అన్నారు. ఎల్లారెడ్డిపేట ఎస్సైగా బదిలీపై వచ్చిన ఆయన మంగళవారం రాత్రి బాధ్యతలు చేపట్టారు. కోనరావుపేట నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చిన రమాకాంత్ చార్జీ తీసుకోని మాట్లాడుతూ గ్రామాల్లో ఏమైనా సమస్యలుంటే శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సూచించారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే చట్టపరిధిలో వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. జూదం, గంజాయి, గుడుంబా లాంటి వాటికి యువత దూరంగా ఉండాలన్నారు. బాధ్యతలు చేపట్టిన ఎస్సైని బుధవారం ప్రజాప్రతినిధులు, సిబ్బంది అభినందించారు.

ఎస్సైని కలిసిన కాంగ్రెస్ నాయకులు

తంగళ్లపల్లి: తంగళ్లపల్లికి నూతనంగా బదిలీపై వచ్చిన ఎస్సై వెంకటేశ్వర్లును గురువారం మండల కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్సైని కలిసిన వారిలో మండల అధ్యక్షుడు జాలగం ప్రవీణ్, లింగాల భూపతి, నేరెళ్ల నర్సింగం గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, గడ్డం మధుకర్ (చోటు) ఉన్నారు..



ఎస్సైకి పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు